


# జూట్ జూలియట్..

సంప్రదాయాన్నీ ఆధునికతనూ కలబోసి వడబోసే విషయంలో ఇప్పటి డిజైనర్లు చేయి తిరిగిన నలభీములే. ఇంతి ఒంటికి ఇంపైన దుస్తుల్ని అలంకరించి అలరించే విషయంలో వీళ్లకు వీళ్లే సాటి. నార దుస్తుల్నీ నారికి నప్పేలా మతలబు చేయగల మాయాజాలం వీళ్ల సొంతం. ఇక్కడ గచ్చకాయ రంగులో ఫ్యాషనబుల్‌గా కనిపిస్తున్నది జూట్ సిల్క్ లెహెంగానే. దానికి గోధుమ వన్నె పెన్ కలంకారీ క్రాప్‌టాప్‌ను జతచేసి హ్యాండ్ ఎంబ్రాయిడరీతో ముస్తాబు చేశారు. ప్రత్యేక సందర్భాల్లో ధరించే విభిన్న కాంబినేషన్ కదూ!

• సమత చౌదరి, డిజైనర్
Samatha Chowdary@wowostudios

# పరిణీత.. గూగుల్ మెచ్చిన వనిత!

**షోలాపూర్‌కు** చెందిన పరిణీత సాంకేతిక దిగ్గజం గూగుల్‌లో టీమ్ లీడర్‌గా ఎంపికయ్యారు. వార్షిక ప్యాకేజీ ఆఫర్ పెద్దమొత్తంలో ఉండటంతో అందరూ ఆమెను అభినందనలతో ముంచెత్తుతున్నారు. ముఖ్యంగా పరిణీతకు తెలుగు నేలతో అనుబంధం ఉన్న కారణంగా షోలాపూర్‌లోని తెలుగు ప్రజలు సైతం పెద్ద ఎత్తున అభినందనలు తెలుపుతున్నారు. గూగుల్‌లో రూ.1.30 కోట్ల ప్యాకేజీ పొందడంపై ఆమె ఆనందం వ్యక్తం చేస్తున్నారు. షోలాపూర్‌లోని లిటిల్ ఫ్లవర్‌లో పరిణీత పాఠశాల విద్య పూర్తిచేసింది. ఆ తర్వాతి విద్యాభ్యాసం హైదరాబాద్‌లో సాగింది. తండ్రి మదన్ ఉద్యోగ రీత్యా పన్నెండేండ్ల క్రితం హైదరాబాద్ వచ్చి స్థిరపడ్డారు. 2013లో ఐఐటీ ఇండోర్‌లో ప్రవేశం పొందింది పరిణీత. అక్కడ బీటెక్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) పూర్తి చేసి క్యాంపస్ ఇంటర్వ్యూలో అమెరికాకు చెందిన బీమా కంపెనీలో ఉద్యోగం సాధించింది. తర్వాత కొంతకాలం ఉబర్, యూఎస్జీలో పనిచేసింది. పరిణీత నైపుణ్యాన్ని మెచ్చిన గూగుల్ ఆమెకు తాజా ఆఫర్ ఇచ్చింది. ఆమెను బెంగళూరు క్యాంపస్‌లో టీమ్ లీడర్‌గా ఎంపికచేసింది. తన విజయంలో గురువులు, తల్లిదండ్రులు ముఖ్యపాత్ర పోషించారని పరిణీత చెబుతున్నది.



నమస్తే తెలంగాణ
జిందగీ 13
హైదరాబాద్ | శనివారం 13 ఏప్రిల్ 2024 www.ntnews.com

# పెదవి చెబుతుంది..

చంద్రవదనంలో కండ్ల తర్వాత కనువిందు చేసేవి అధరాలే! అరవిరిసిన పెదాలపై పదాలు కట్టిన కవికుల తిలకులు ఎందరెందరో! మోవి గని మొగ్గ అని వర్ణించిన వారు కొందరైతే, గులాబీ రేకులే పెదాల సోకు అని తీర్మానించారు ఇంకొందరు. ముత్యాల పలువరుసకు కెంపుల పరదాల్లాంటి అధరాల వైనాన్ని వివరించే శాస్త్రమూ ఉంది. అదే లిపాలజీ! వలపు విరుపుల పెదవుల నిర్మాణ రీతిని బట్టి.. ఆ మనిషి తీరును ఇది వివరిస్తుంది.





**పలుచటి పెదాలు:** పూల రేకుల్లా సన్నని పెదాలున్న వాళ్లు ఇట్టే ఆకట్టుకుంటారు. ఈ తరహా అధరాలు ఉన్నవాళ్లు తమతో తాము గడపడానికి అధిక ప్రాధాన్యం ఇస్తారట. జీవిత భాగస్వామితో సంతోషంగా ఉండటానికి ప్రయత్నిస్తారని లిపాలజీ ఉవాచ.



**ముద్ద మందారం:** ముద్దిచ్చే పెదాలు ముద్ద మందారంలా నిండుగా ఉన్న వాళ్లు.. మెండు మనసు కలిగి ఉంటారని లిపాలజీ చెబుతున్నది. అయితే వీళ్లు చిన్నచిన్న విషయాలకే భంగపడి బుంగమూతి పెట్టుకుంటారట.



**పప్పీ పెదాలు:** ఒత్తుగా, పెద్దగా ఉండే పెదాలను పప్పీ లిప్స్ అంటారు. ఈ తరహా పెదవులు ఉన్నవాళ్లు విశాల హృదయం కలిగి ఉంటారు. వీళ్లకు సాటివారిపై సానుభూతి ఎక్కువ. జంతువులను అమితంగా ప్రేమిస్తారట కూడా!



**పువ్వు విచ్చుకున్నట్టు:** ఇలాంటి పెదాలు ఉన్న వారు చాలా ఆకర్షణీయంగా కనిపిస్తారు. వీళ్ల మనస్తత్వం స్థిరంగా ఉంటుందట. అందంగా మాట్లాడటమే కాదు, ఎదుటివారు చెప్పింది మనస్ఫూర్తిగా వింటారని సెలవిస్తుంది లిపాలజీ.



**స్టంగ్ లిప్స్:** చిన్నగా, ఉబ్బెత్తుగా ఉండే పెదాలున్నవాళ్లలో స్వార్థం పాలు ఎక్కువగా ఉంటుందట. మాయమాటలు చెప్పేవారిని త్వరగా నమ్మేస్తారు. ఆ మాటలు తమకు హాని కలిగించేవి అయితే అప్రమత్తం అవుతారట.



**పై పెదవి పెద్దగా:** కింది పెదవి కన్నా.. పై పెదవి పెద్దగా ఉన్న వాళ్లు వినమ్రులుగా ఉంటారని పెదాల శాస్త్రం పలుకుతున్నది. వీళ్లు నిజాయతీగా ఉంటారు. వీరిలో సెన్సాఫ్ హ్యూమరూ ఎక్కువే!



**కింది పెదవి పెద్దగా:** పై పెదవి కన్నా.. కింది పెదవి పెద్దగా ఉన్నవాళ్లకు సాహస కృత్యాలంటే ఇష్టం ఉంటుందట. కొత్త పరిచయాలు చేసుకోవాలనే ఆసక్తి వీళ్లలో అధికం. తరచూ ప్రయాణాలు చేయాలని కోరుకుంటారు.

# నాన్‌స్టాప్ ఉపాధి!

పరిస్థితులకు అనుగుణంగా నైపుణ్యం సాధిస్తే బతుకు బండిని సునాయాసంగా లాగవచ్చు అని చెప్పడానికి ఈ మహిళే చక్కటి ఉదాహరణ. ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించే క్రమంలో ఇల్లు, ఆఫీసు తప్ప మరో ప్రపంచం చూడని ఈమె.. అనుకోకుండా ఉద్యోగాన్ని వదులుకోవాల్సి వచ్చింది. అటు తర్వాత చుట్టుముట్టిన ఆర్థిక కష్టాలు ఆమెను సర్వీస్ సెక్టార్ బిజినెస్ వైపు అడుగులు వేసేలా చేశాయి.. వన్ స్టాప్ సొల్యూషన్ కంపెనీ స్థాపించడానికి పురిగొల్పాయి. ఇన్సూరెన్స్, టెలి మార్కెటింగ్, స్కిల్ డెవలప్‌మెంట్ సేవల ద్వారా గృహిణుల ఆదాయానికి బాటలు వేస్తున్న కరాటి అనురాధ స్టార్టప్ స్టోరీ ఆమె మాటల్లోనే..

**నేను** పుట్టి పెరిగిందంతా హైదరాబాద్‌లోనే. సామాజిక అంశాల్లో అమ్మ ఎంతో చురుగ్గా ఉండేది. ఆమె ప్రభావం నాపై ఉంది. ఇంటి వ్యవహారాలను చక్కబెడుతూనే సమాజానికి మేలు చేయాలని పరితపించే అమ్మ జీవితం నాకు స్ఫూర్తి. చిన్నప్పటి నుంచి అమ్మ కొంగు పట్టుకు తిరిగిన కారణంగా విద్యాభ్యాసం, పెండ్లి తర్వాత చాలా మంది మహిళల్లా నేను ఇంటికే పరిమితం కాలేదు. ఓ ప్రైవేటు సంస్థలో సాధారణ ఉద్యోగిగా చేరి సీనియర్ అకౌంటెంట్ స్థాయికి ఎదిగాను. ఈ క్రమంలో ఇల్లు, ఆఫీసే ప్రపంచంగా బతికాను. అనుకోకుండా తీవ్ర అనారోగ్యంతో మంచాన పడిన అత్తమ్మను చూసుకునేందుకు ఉద్యోగాన్ని మానుకోవాల్సి వచ్చింది. ఆ తర్వాత ఏడాదిన్నర తిరక్కుండానే ఆర్థిక ఇబ్బందులు ఎదురుకావడంతో ఇల్లు, ఆఫీసు విడిచి బయటి ప్రపంచంలోకి వచ్చేశాను. అకౌంటింగ్ రంగంలో నాకున్న పరిజ్ఞానం, కంపెనీల అవసరాలెలా ఉంటాయో తెలిసినదాన్ని కావడంతో కంపెనీలకు అడ్వయిజరీ తరహా సేవలను అందిస్తూ ఆదాయం పొందవచ్చన్న ఆలోచన కలిగింది. అలా సాధారణ ఇన్సూరెన్స్ ఏజెంట్‌గా ప్రారంభమైన నా పయనం 'వన్ స్టాప్ సొల్యూషన్'ను స్థాపించేదాకా సాగింది. కేవలం జనరల్, హెల్త్ ఇన్సూరెన్స్‌ల వద్దే ఆగిపోకుండా కార్పొరేట్ సంస్థలకు నా సేవలు విస్తరించడంపై దృష్టి పెట్టాను. అలా కంపెనీలకు అవసరమయ్యే ఇన్సూరెన్స్, ఫైనాన్స్, అకౌంటింగ్ సేవలు అందిస్తున్నాను.

**ఒకప్పుడు** ఇన్సూరెన్స్ అంటే ఎల్ఐసీ ఏజెంట్లు మాత్రమే గుర్తొచ్చేవారు. కానీ అందులో ఎన్నో రకాలున్నాయి. బడా కంపెనీలు భారీ మొత్తంలో చార్జ్ చేసి సేవలు అందిస్తాయి. ఇదే వన్ స్టాప్ సొల్యూషన్‌కు వ్యాపార మార్గం అయింది. కంపెనీలకు అవసరమైన పాలసీలు, ఆర్థిక అవసరాలు, ఉద్యోగుల ఆర్థిక స్థితిగతులకు అనుగుణంగా అడ్వయిజరీ ఆధారిత సేవలను మొదలుపెట్టాను. కొన్నాళ్లలోనే ఒకేసారి గంపగుత్తగా కంపెనీ పాలసీలు చేసే స్థాయికి చేరుకున్నాను. ఈ సేవలను పర్యవేక్షించే బీమా సేవల సంఘం వ్యవస్థాపక సభ్యురాలినయ్యాను. మారుతున్న మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా కొత్త ప్రాజెక్టులు రూపొందించేలా ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఐఆర్‌డీఏ) సహకారంతో శిక్షణ తరగతులు, అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నాం. ఈ రంగంలో ఎదురవుతున్న ఇబ్బందులకు పరిష్కార మార్గాలు చూపించగలుగుతున్నాం.

### శిక్షణ.. ఉపాధి...

మహిళలు, యువతులకు నా వంతుగా సాయం చేయాలన్న ఉద్దేశంతో వృత్తి నైపుణ్యాలను పెంపొందించే సంస్థలతో జతకట్టాను. నగరంలో ఉన్న స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లతో అనుసంధానమై మహిళలకు వర్క్ ఫ్రం హోమ్ తరహా ఉపాధినిచ్చే కోర్సుల్లో శిక్షణనివ్వడం మొదలుపెట్టాను. టైలరింగ్, ఎంబ్రాయిడరీ, క్రాఫ్ట్, జువెలరీ.. ఇలా ఎన్నో రంగాల్లో ఉపాధి, ఉద్యోగం పొందేందుకు అవసరమైన నైపుణ్యాలను పెంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నాను. ఇప్పటివరకు సుమారు 600 మందికి శిక్షణ ఇచ్చాం. ఇంటి పట్టున ఉండే మహిళలు ఏదైనా కొత్తగా చేయాలంటే ఎన్నో సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుంది. కుటుంబ సభ్యుల ప్రోత్సాహం అటుంచితే సమాజపు సూటిపోటి మాటలే అడుగు ముందుకు వేయకుండా అడ్డుపడుతుంటాయి. ఈ ఒడుదొడుకులకు ఎదురొడ్డి నిలబడి తానేంటో నిరూపించుకుంటే వ్యతిరేకించినవాళ్లే చేయూతనిస్తూ విజయాలకు కారణమవుతారు. ఇలాంటి సవాళ్లను దాటుకుంటూ సాగిన జీవిత ప్రయాణంలో నాకు ఎన్నో అవార్డులు, మరెన్నో గుర్తింపులు దక్కడం సంతోషాన్నిస్తుంది.




### ఇంటి నుంచే పని..

మా ప్రయత్నంలో భాగంగా గృహిణులతో ఒక బృందాన్ని ఏర్పాటు చేసి, ప్రత్యేక శిక్షణనిచ్చాం. ఉపాధి మార్గం చూపాం. కొంతకాలం తర్వాత వారితోనే ఒక వేదిక ప్రారంభించాం. అదే వన్ స్టాప్ సొల్యూషన్. ఐదారుగురితో మొదలైన సంస్థ కార్యకలాపాలను క్రమంగా విస్తరించాం. రెండు మూడేండ్లలోనే 100 మందికి ఫైనాన్స్, ఇన్సూరెన్స్ అంశాల్లో శిక్షణ ఇచ్చాను. మా దగ్గర శిక్షణ పొందిన మహిళలు గడప దాటకుండా ఇంటినుంచే పని చేసుకునే వెసులుబాటును వన్ స్టాప్ సొల్యూషన్ కల్పించింది. ప్రస్తుతం 300 మంది మహిళలు, యువతులు నాతోపాటు కలిసి పనిచేస్తున్నారు.

... కడార్ల కిరణ్



చిన్నతెర

'ముద్దమందారం' సీరియల్‌తో తెలుగు ప్రేక్షకులను పలకరించిన కన్నడ ముద్దుగుమ్మ తనూజ పుట్టస్వామి. తన అసలు పేరుతో కంటే ముద్దమందారం పార్వతిగానే ప్రేక్షకుల మదిలో స్థానం సంపాదించి మొదటి సీరియల్‌తోనే మంచి మార్కులు కొట్టేసింది. అక్క లాయర్, చెల్లి ఇంజినీర్.. కానీ తాను మాత్రం నటనపై మక్కువ పెంచుకుంది. అనుకోకుండా సినీ పరిశ్రమకు పరిచయమై నటననే వృత్తిగా ఎంచుకుంది. బుల్లితెరపైనే కాకుండా వెండితెరపైనా తానేంటో నిరూపించుకుంటూ కన్నడ, తమిళ, తెలుగు ప్రేక్షకులను అలరిస్తున్న కన్నడ సోయగం తనూజ పుట్టస్వామి జిందగీతో పంచుకున్న ముచ్చట్లు...

# నాన్న మూడేండ్లు మాట్లాడలేదు!

**మాది** ఉమ్మడి కుటుంబం. అమ్మానాన్న చాలా స్ట్రిక్ట్. కానీ నేను చాలా అల్లరి పిల్లని. మేం ముగ్గురు అక్కాచెల్లెళ్లం. నేను మధ్యలో అమ్మాయిని. మిగతా ఇద్దరూ అమ్మానాన్న చెప్పినట్లు విని మంచి పిల్లలు అనిపించుకునేవాళ్లు. నేను మాత్రం స్కూల్ టైం నుంచి లాస్ట్ బెంచ్ స్టూడెంట్‌ని. ఎప్పుడూ అల్లరి చేస్తూ ఉండేదాన్ని. మా నాన్నకు ఉపాధ్యాయ వృత్తి అంటే చాలా ఇష్టం. మా మేనత్త కొడుకు కూడా లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. దాంతో నాన్న నన్ను కూడా టీచర్ చేయాలని అనుకున్నారు. కానీ నేను అనుకోకుండా నటనవైపు వచ్చాను. కాలేజీ టైమ్‌లో ఓ కన్నడ సినిమాలో హీరోయిన్‌గా అవకాశం వచ్చింది. ఇంట్లో ఎవరూ ఒప్పుకోలేదు. నాన్న దాదాపు మూడేండ్లు మాట్లాడ్డం మానేశారు. అయినప్పటికీ నేను పట్టు వదలకుండా వచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకుని వెండితెరకు పరిచయమయ్యా. కన్నడ సినిమా రిలీజ్ అయిన తర్వాత తెలుగులో అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మించిన 'ముద్దమందారం' సీరియల్‌లో ఆఫర్ వచ్చింది. మొదట భయపడ్డా. కానీ ధైర్యం చేసి ఒప్పుకొన్నా. నాకు తెలుగు కొంచెం కూడా అర్థమయ్యేది కాదు, దాంతో ఎవరు ఏం మాట్లాడుతున్నారో తెలియక ఏడ్చేసేదాన్ని. కానీ సీరియల్ టీమ్ అందరూ నాకు సపోర్ట్ చేసి ప్రతీదీ అర్థమయ్యేలా చెప్పారు. ఇప్పుడు ఇంత బాగా తెలుగు మాట్లాడగలుగుతున్నానంటే.. ఈ క్రెడిట్ అంతా ముద్దమందారం సీరియల్ టీమ్‌దనే చెప్పాలి.

### ఇప్పటికీ అంతే..

నా మొదటి సినిమా తర్వాత ఇటు బుల్లితెరపైనా, అటు వెండితెరపైనా వరుస అవకాశాలు వస్తూనే ఉన్నాయి. ముద్దమందారం సీరియల్ ఏకంగా ఆరు సంవత్సరాలు ప్రసారమైంది. ఆ సమయంలో చాలా అవకాశాలు వచ్చాయి. కానీ సీరియల్ షూట్‌కి, సినిమాల షూటింగ్‌కి తేదీలు క్లాష్ కావడంతో కొన్ని అవకాశాలు వదులుకున్నా. నేను ఏ ప్రాజెక్ట్ ఓకే చేయాలన్నా మా అమ్మానాన్న పర్మిషన్ తీసుకున్నాకే సైన్ చేస్తాను. కొవిడ్ టైమ్‌లో కొన్ని అవకాశాలు వచ్చినా కుటుంబాన్ని మిస్ అవుతున్నాననిపించి రెండేండ్లు గ్యాప్ తీసుకున్నా. అంతా సద్దుమణిగిన తర్వాత మళ్లీ కథలు వినడం ప్రారంభించా. ఏ సీరియల్, సినిమా అవకాశం వచ్చినా నా మొదటి ప్రాధాన్యత కథకే. నా పాత్రకు ఉండే ప్రాధాన్యతను బట్టే ఓకే చేస్తాను. ఇప్పటికీ చాలా అవకాశాలు వస్తున్నాయి కానీ ఆచితూచి ఎంచుకుంటున్నా. ఒకేసారి రెండు మూడు ప్రాజెక్టులు ఒప్పుకోను. ఒక ప్రాజెక్ట్ పూర్తయిన తర్వాతే మరొకటి ఒప్పుకొంటా. కెరీర్‌తో పాటే కుటుంబానికీ తగినంత సమయం కేటాయించేందుకు ప్రయత్నిస్తా. ప్రస్తుతం ఒక తెలుగు సినిమాలో మంచి రోల్ చేస్తున్నా. ఆ సినిమా పేరు ఇప్పుడే చెప్పలేను.



### తెలుగు ప్రేక్షకులు ప్రత్యేకం..

జీ తెలుగు ఛానెల్ నన్ను తెలుగు పరిశ్రమకు పరిచయం చేసింది. అందుకే జీ కుటుంబంలో సభ్యురాలిగా మారిపోయా. సూపర్ జోడీ షో ద్వారా మరోసారి నాలోని కొత్త యాంగిల్‌ని ప్రేక్షకులకు పరిచయం చేశారు. నాకు డ్యాన్స్ అంటే పెద్దగా ఆసక్తి ఉండదు. అలాంటి నేను ఒక డ్యాన్స్ షోలో పోటీపడటం నమ్మలేకపోతున్నా. ఇదే నా ఫస్ట్ డ్యాన్స్ కాంపిటీషన్. దాదాపు ఫైనల్ చేరుకున్నాం. టైటిల్ గెలుచుకుంటామనే నమ్మకం ఉంది. అందుకోసం ఎంత కష్టపడాలో అంతకంటే ఎక్కువే కష్టపడుతున్నాం. జగద్ధాత్రి సీరియల్‌లో గెస్ట్ అప్పియరెన్స్‌లో కనిపించడం కూడా చాలా సంతోషం కలిగించింది. ఐదేండ్ల తర్వాత మళ్లీ మేమంతా కలిసి నటించడం చాలా బాగుంది. ఇన్నేండ్ల తర్వాత కనిపించినా మళ్లీ ప్రేక్షకులంతా ముద్దమందారం పార్వతి అంటూ నన్ను గుర్తుపట్టి ఆదరించడం చాలా ఆనందంగా ఉంది. కన్నడ అమ్మాయినైనా తెలుగు ప్రేక్షకులు తమ అమ్మాయిగానే ఆదరించారు. నేను గ్యాప్ తీసుకున్నప్పుడు కూడా చాలామంది మా కుటుంబ సభ్యులను అడిగి మళ్లీ నేను తెరపై కనిపించేందుకు కారణమయ్యారు. ప్రతి ఒక్కరి జీవితంలో పెండ్లి అనేది ఒక అద్భుతమైన విషయం. నా జీవితంలో ఆ అద్భుత క్షణం కోసం చాలా ఆసక్తిగా ఎదురు చూస్తున్నా.

### ట్రావెలింగ్ అంటే ఇష్టం..

వేసవి కాలం వచ్చిందంటే ఆహారం తీసుకున్నా తీసుకోకపోయినా వీలైనంతవరకు జ్యూస్‌లు, కొబ్బరినీళ్లు, నీళ్లు తాగుతూ ఉంటా. మన శరీరం డీహైడ్రేట్ అవకుండా ఉండటానికి ఇవి చాలా ఉపయోగపడతాయి. రెండు రోజులకు ఒకసారి ఐస్ క్యూబ్‌తో పడుకునే ముందు ముఖాన్ని రబ్ చేసుకుని నైట్ క్రీమ్ రాసుకుంటా. వేసవి కాలంలో చర్మం కాంతిమంతంగా ఉండేందుకు ఈ చిట్కా చక్కగా పనిచేస్తుంది. ట్రావెలింగ్ అంటే ఇష్టం. ఏ పండుగ వచ్చినా మా అమ్మమ్మ వాళ్ల ఊరు వెళ్తుంటాం. పుస్తకాలు ఎక్కువగా చదువుతాను.



... హరిణి